


సంఘం అనేది ఒక పెద్ద యంత్రశాల. యంత్రశాలలో రకరకాల యంత్రాలు ఉంటాయి కొన్ని మానవాభ్యుదయానికి తోడ్పడేవి - మరికొన్ని మానవ పతనానికి దారి తీసేవి - మానవులు ఈయంత్రాలలోని మరలు - హూదాను, ప్రతిపత్తినిబట్టి పెద్దవిగాను, చిన్నవిగాను ఉండడం అతి సహజం - కాని అసలు మరలు లేకుండా యంత్రమే ఉండదు. ఒక మర చెడిపోతే దాని స్థానాన్ని ఒక కొత్త మర తీసుకుంటుంది. అప్పుడు చెడిపోయిన మరకు ఎట్టి విలువా ఉండదు. నిలువలో మరలు ఎక్కువగా ఉంటే మరల విలువ తగ్గిపోతుంది సముచితస్థానంకోసం, మరలు ఒకదానితో ఇంకొకటి పోటీపడవలసివస్తుంది పోటీలో గెలుపొందిన మరకు మాత్రమే యంత్రంలో తగిన స్థానం లభిస్తుంది ఇక తక్కిన మరలు అవకాశంకోసం నిరీక్షించాల్సి ఉంటుంది. అవకాశం ఎప్పుడు దొరుకుతుందో ఏమో చెప్పలేము. కాని అవకాశం ఏనాటికైనా రాకపోదనే ఆశతో మరలు, తమ తమ chance కోసం ఎదురుచూడక తప్పదు ఎదురుచూడకపోతే ఆ అవకాశం తరువాతి మరకు దొరుకుతుంది అప్పుడు విచారించి ఏమీ లాభం ఉండదు. ఇదే మన జీవిత రహస్యం

ఒక రోజు లేచి లేవడంతోనే నాకు బాగా ఆకలివేసింది కాలకృత్యాలు తీర్చుకుని ఆత్మారాముడిని సంతృప్తిపరచడంకోసం, కాఫీ దేవాలయం వేపు బయల్దేరాను ప్రథానార్చకుడు గుమ్మానికి ఎదురుగా ఒక టేబుల్ దగ్గర కుర్చీలో కనబడ్డాడు - కైంకర్యానంతరం అతనికి దక్షిణ సమర్పించిగాని, మనం బయటపడడానికి వీలులేదు ఆనాడు దేవాలయంలో భక్తులు క్రిక్కిరిసిఉన్నారు ఎక్కడా కూర్చోనడానికి కూడా చోటులేదు ప్రధానార్చకుడిని చోటుకోసం అడిగితే, మహాభక్తులంతా అన్నపూర్ణాదేవికటాక్షం కోసం ఎంతోకాలంనించి, ఏకాగ్రతతో "క్యూ" లో నిలబడిఉన్నారనీ, "మీరు" కూడా శ్రద్ధాళువులై నిలబడక తప్పదని సెలవిచ్చారు భారతావనిపై అన్నపూర్ణాదేవి కటాక్షవీక్షణం తొలగిపోయిన రోజులివి అర్చకుడిసూచనను త్రోసివేస్తే, పాదచారులమై ఇంకొక దేవాలయానికి వెళ్ళవలసి ఉంటుందని, ఏ దేవాలయంలోనైనా భక్తుల సంఖ్య ఇంతకంటె తక్కువేమీ ఉండదని మొండికేసి వడితే మనం యిడ్లీ, టీ, కాఫీ గతప్రాణులంగనక అసలు తీర్థప్రసాదాలకే మోసం రావచ్చునని చేసేదేమీలేక ఆ"క్యూ"లో నిలబడ్డాను. సెకండ్లు నిమిషాలుగా మారుతున్నాయి.

**"మురళి"**

కాలచక్రం మహావేగంగా ముందుకు పరిగెడుతున్నది ఆలస్యంగా వచ్చినా, కొందరు దౌర్జన్యంచేసి "క్యూ" లో ముందుకు తోసుకొని వెడుతున్నారు కాని "క్యూ" ముందుకు సాగే లక్షణమేమీ కనపడదు స్వార్థపరులు ప్రగతిని అడ్డగిస్తున్నారు. చివరకి వారిస్వార్థమే వారిని బెడిసికొడుతుంది. అదిఏనాటికైనాతప్పదు. కాంగ్రెస్‌లో కొంతకాలం పనిచేసి, సత్యాహింసల్ని అలవరచుకున్నాను. కనక ముందుకు తోసుకొని వెళ్ళడానికి, దౌర్జన్యరూపేణా నేను సాహసించలేకపోయాను దౌర్జన్యానికి ఆక్షేపణ సూచకంగా 'క్యూ' లోంచి తప్పుకుందామనుకున్నాను. కాని ఇంట్లో ఇల్లాలు లేకపోవడంవల్ల వెనుకంజ వేయవలసివచ్చింది.

ఒకతను 'క్యూ' విడిచి అన్యాయంగా ముందుకు తోసుకొని వెడుతుంటే చూడండి అతను ఎంత దౌర్జన్యం చేస్తున్నాడో!' అని పక్కనున్న మనిషితో అన్నాను.

"ఎవరి దౌర్జన్యం వాళ్ళనే బెడిసికొడుతుంది" అని నాపక్కనున్న మనిషి సమాధానం చెప్పాడు

మనది ఆధ్యాత్మికదేశంగనక దౌర్జన్యం జరిగినా చూచీ చూడనట్లు నలుగురితో పాటు నేనూ మౌనం వహించాను

తరువాత తీర్థప్రసాదాలు పుచ్చుకొని దేవాలయంలోనించి బయటపడ్డాను. అప్పటికే తొమ్మిది దాటింది. ఆనాటికి ఇక భోజనానికి జలాంజలులు వదిలి దుస్తులు వేసుకొని ఆఫీసుకు బయల్దేరాను.

* * * *

హైద్రాబాద్ ఒక పెద్ద నగరం-దానిని city of distanese అంటారు ఒక మూల మాయిల్లు ఉంటే, ఇంకొకమూల ఆఫీసువుంది నడిచి వెళ్ళడానికి అధమం ఒక గంట పడుతుంది భోజనం లేక అప్పటికే శరీరం నీరసంగా ఉంది ఆఫీసుకు నడిచివెడితే, శోషవచ్చి దారిలో పడిపోతానేమో నని భయంవేసి, మాయింటి పక్కనేఉన్న Bus stand దగ్గర ఆగిపోయినాను నా ఖర్మంకాలి, ఆరోజు అక్కడకూడా ఒక "క్యూ" ప్రత్యక్షమైంది. "క్యూ"లో వందకుపైగా జనం ఉన్నారు. రంగురంగుల దుస్తులతో, వంకరటింకరగా "క్యూ"చూడ ముచ్చటగా ఉంది 'క్యూ'లో నిలబడడం కొందరికి నామోషీ—అందువల్ల వారు తామరాకుపై నీటిబొట్టువలె, "క్యూ"కి అందకుండా, ముందుకో, వెనక్కో నిలబడుతారు. సుశిక్షితంగా మెలగడం వారికి గిట్టదు. అలా ఎందుకు నిలబడ్డారని వారిని అడిగేవారెవ్వరూ ఉండరు. భారతావని ప్రజాస్వామికదేశం - సమావేశ ఉపన్యాస స్వాతంత్ర్యాలవలె, వారికి ఎక్కడబడితే అక్కడ నిలబడడానికి హక్కువుంది. "కాదంటే" మనం వారి స్వాతంత్ర్యాన్ని అపహరించినవాళ్ళ మవుతాము—

(19-వ పేజీ చూడండి)

# క్యూ

(14-వ పేజీ తరువాయి)

వందకు పైగా జనంగల "క్యూ"ని చూడడంతోనే, నాకు గుండెలు జారిపోయినాయి.

ఆఫీసుకు "నడిచా" వెళ్ళలేను - "క్యూ"లో గంటల తరబడి "నిలబడనూ" లేను— Hamlet పడ్డ అవస్థలో పడ్డాను-"క్యూలో నిలబడడమా? లేక నడిచివెళ్ళడమా?" అని- నడిచి ఎల్లాగూ వెళ్ళలేను కనుక, చివరకి "క్యూ"లో నిలబడడానికే నిశ్చయించాను.

మా ఊళ్ళో మాకు మల్లేనే మాబస్సులది కూడా చాలా విచిత్రమైన "నడవడి" - వస్తే ఒకేమాటు, ఒకటి తరువాత ఇంకొకటి చొప్పున, రాజఠీవిగా, వరసగా పది బస్సులు వస్తాయి. రాకపోతే గంటలతరబడి అసలే రావు. ఇది ప్రజాస్వామిక యుగం కనుక మాకుమల్లే వాటికి కూడా రాకపోకలవిషయంలో సంపూర్ణస్వేచ్ఛ ఉంది. రాకపోతే సమయానికి ఎందుకు రాలేదని వాటిని అడిగేనాథుడు ఎవ్వడూ ఉండడు. నాథుడంటూ ఒకడున్నా అతని మాట అవి లక్ష్యపెట్టవు. వస్తే Stand కి వందగజాలముందో, లేక వందగజాలవెనకాలో నిలుస్తాయి. ప్రయాణీకులను దింపి, చోటు ఉన్నా ఇతర ప్రయాణీకులను తీసుకోకుండానే వెళ్లిపోతాయి. బస్సు చప్పుడు వినపడ్డంతోనే, "క్యూ"లో ఒక గొప్ప సంచలనం బయల్దేరుతుంది. మొదట సుషుప్తిలోవున్న శ్రేణి, అంటే "క్యూ", Bus దర్శనభాగ్యం కలగడంతోనే జాగ్రదవస్థలోకి వస్తుంది. ఉద్వేగాన్నీ, ఉక్రోషాన్నీ కక్కుతుంది. ఆగ్రహావేశాల్ని కనపరుస్తుంది. దుమ్ములో, పొగలలో యావత్తుశ్రేణీ బస్సుపై విరుచుకుపడుతుంది. జనసమూహం కోతుల దామెరగా మారుతుంది. పక్కలనించి ఎక్కేవాళ్లు కొందరు - వెనకాముందులనించి ఎక్కేవాళ్లు మరికొందరు - తోసుకొని వెళ్ళడంలో జాతి మత లింగ విభేదాలు ఉండవు - ప్రజాస్వామికాదర్శాలు, నగ్నంగా కట్టెదుట కనబడుతాయి. "క్యూ" చివరవున్న మనిషి, బస్సులో మొదటి "సీటు"లో ఉంటాడు. "క్యూ" మొదటవున్న మనిషి, బస్సుకి వందగజాల ఎడం అవుతాడు. ఇంతలోకే బస్సు వెళ్ళిపోతుంది. రెడ్డివచ్చె మొదలాడన్నట్లు, మళ్లీ కొత్తగా "క్యూ" ఏర్పడుతుంది. అప్పుడు ఏవ్యక్తికూడా "క్యూ"కి అతీతంకావడానికి వీలు లేదు. అతీతం అవుతే, వున్న కాస్త అవకాశం చేతులారా జారవిడుచుకోవాల్సివస్తుంది.

అప్పట్లో నాలుగు బస్సులు వచ్చాయి - నాలుగూ వెళ్ళిపోయినాయి. నాలుగుసార్లు క్యూలు ఏర్పడినాయి. కాని చివరవరకూ నేను "క్యూ"ని వదిలి ఉండలేక పోయినాను - దయ్యాలు లేవని ఇతరులకి నమ్మకంగా చెప్పి, మనంమాత్రం భయపడకుండా ఉండలేనట్లు - దేవుడు లేడని నమ్మిన నాస్తికుడు, ఎందుకైనా మంచిదని దేవాలయం కనపడడంతోనే, "మెకానికల్"గా దండం పెట్టినట్లు - ఆరోజు Necessary Evil గా "క్యూ" నా వెంట బడింది. అయిదోసారి సాధించి ఏదోవిధంగా బస్సు ఎక్కాను- జుట్టూ, కనుబొమలూ దుమ్ముతో నిండిపోయినాయి. టోపీ క్రిందపడిపోయింది. పోటీలో ఉత్సాహం, త్యాగం ఎందుకు ఉంటాయో తెలియదు- ఆఫీసులో మాటకి ముందు ఆఫీసర్ నన్ను పిలవడం కద్దు. నాలో ఏదో విశిష్టత ఉండికాదు- అతని అధికార గర్వాన్ని నాపై ప్రయోగించి నా దాస్యవృత్తిని నాకు కళ్ళకి కట్టినట్లు చూపడానికి. టోపీలేకుండా అతని ముందుకు వెళ్లడం బాగుండదని తోచి సెలవు చీటీ వ్రాసి హెడ్‌గుమాస్తాకి యిచ్చాను. నా అవతారం చూచి "ఏమిటిదని?" అతను అడిగాడు. "మరేమీలేదు - ఒంటి నిండా దుమ్ము అయింది - ఇది "క్యూ" ప్రభావమని చెప్పాను- అతను ఒకవింత మృగాన్ని చూచినట్లు నా వేపు చూచాడు - అతని టేబుల్ పైన నాకు Seniority list కనపడింది. దానిలో ఒక ఉద్యోగి పేరు తరువాత, ఇంకొక ఉద్యోగి పేరు వ్రాసి వుంది. అక్కడకూడా ఒక "క్యూ" ప్రత్యక్షమైనందుకు విచారంతో గుండె బరువెక్కింది. ఇక ఈ "క్యూ" నించి మానవమాత్రుడికి విముక్తి ఉండదనితోచింది. జీవితావసరాల వలె, ఈ "క్యూ" పద్ధతి, ఒక అవసరంగా మారింది.

"క్యూ" కి దడిసి కాలినడకనే, ఆఫీసు నించి యింటికి తిరిగి వచ్చాను.

* * * *

మధ్యాహ్నం ఒక కునుకుతీసి లేచేసరికి, శరీరం తేలికగా కనపడింది. ఉత్సాహం వెల్లివిరిసింది. తీసుకోక, తీసుకోక ఆనాడు సెలవు తీసుకున్నాను. మళ్లీ మళ్లీ సెలవు అడిగితే దొరకదు. జన్మకు ఒక శివరాత్రి వలె సెలవు లభించింది. కనక ఆరోజు హాయిగా గడపాలనుకున్నాను. "హాయిగా గడపడమంటే, ఏమిటని" ఆలోచించాను. మూడవతరగతి గుమాస్తాకు, సినిమాకి వెళ్లడం తప్ప, హాయిగా గడపడానికి, యితరవ్యాసంగమేమీ ఉండజాలదని తోచింది. పత్రిక తిరగవేస్తే, Royal లో "The best years of our lives" నడుస్తున్నదని తెలిసింది. "మనదీ ఒక బ్రతుకేనా? ఇవేనా మన మంచిరోజులని?" నిస్పృహ కలిగింది. ఇది చాలా గడ్డు సమస్య - దీనినిగూర్చి ఆలోచించి లాభం లేదని తోచి, కాలినడకని Royal కి వెళ్ళాను. Royal లో ప్రతి కిటికీ దగ్గర నాకు ఒక పెద్ద "క్యూ" కనపడింది. ఏడు అణాల కిటికీదగ్గర, పన్నెండణాలకి కిటికీ దగ్గరకంటె రెండింతలు జనం కనపడింది. రూపాయి రెండణాల కిటికీ దగ్గర జనం కొంచం తక్కువగా ఉంది. పైగా ఆ "క్యూ"లో యిద్దరు ముగ్గురు స్త్రీలుకూడా ఉన్నారు. క్యూని ఎంత అసహ్యించుకున్నా, భ్రాంతికాకర్షణలకి దాసుడినై, చివరికి అదే క్యూలో వెళ్ళినిలబడినాను.

మా "క్యూ"లో ఒక యువకుడి పక్కన ఒక అందమైన అమ్మాయి నిలబడిఉంది. యువకుడు సూటిగా ఆ అమ్మాయి కళ్లల్లోకి చూస్తున్నాడు. యువతి Receptive గా, అతని చూపులకి తన చూపులతో మారుపలుకుతున్నది. కొంతకాలం చూపులతో

(31-వ పేజీ చూడండి)

---

నలు అతని మనస్సుని చీకాకు పరుస్తున్నవి. అరాత్తుగా వున్మత్తునిమాదిరి లేచి కూచుని వుద్రేకంగా— "నిన్ను అరెస్టు చేయిస్తాను. జైల్లో పెట్టిస్తాను. నువ్వు ఎక్కడున్నా వదలను! బద్మాష్ జాగ్రత్త! నా కంట పడ్డావంటే షూట్ చేస్తాను." అంటూ పక్కమీదనించి తుపాకి తీసుకురావటానికి దూకాడు. ఇంతలో యేదో తలుపుకు కొట్టుకున్న ధ్వని అయింది

అంతా వొక్కసారిగా మేల్కొన్నారు. స్విచ్ నొక్కారు. లైట్లన్నీ వెలిగినై. వచ్చి చూస్తే రాముడు బోర్లపడివున్నాడు. రాముడి నోటినించి రక్తం కారుతూవుంది. సీలువేసిన మనీబాగ్ చెక్కుచెదరకుండా రాముడి నారలేని చేతుల్లోవుంది! "అరే! రాముడు!"అని, బాబు పెద్దగా కేకవేశాడు.

బాబు వాణ్ణి లేవదీయబోయి, కెవ్వుమన్నాడు. పాపం బాబు తలపట్టుకుని, అక్కడే చతికిలపడ్డాడు. డబ్బు దక్కింది కాని రాముడు దక్కలేదు! వాడి హృదయవేదనకూడా బాబుకి అజ్ఞాతంగానే వుండిపోయింది!

# ఒక చీకటిరాత్రి

(10-వ పేజీ తరువాయి)

నాయుడు కౌనా పక్కనించి గట్టెక్కి వొస్తున్నాడు.

"ఆరిఫ్గాలా! నువ్విక్కడనక్కి వున్నావూ?" అన్నాను.

లేకపోతే తమరు నైటేస్తప్పుడు ఆల్లకి కనిపించనా?"

అందుకే రామ్క్రిష్ణమీదికి ఫోకస్ చేసినప్పుడు వీడు కనిపించలేదు. తెలివైనవాడే ఎలాగయితే నేం.

కాని వాడు ఎంత వుపకారం చేసినట్టు. ఇరవై రూపాయల బేరం చూపించాడు. వాడిది చాలా వుదారస్వభావంలా తోచింది నాకు. ఎంత ఇస్తే బాగుంటుంది?

వాణ్ణి ఆపక్కని నిలబెట్టి రామ్క్రిష్ణని అడిగాను. "ఏమిరా, వీడి కెంత యిద్దాం?"

"పందొమ్మిదున్నాయి కదూ! మూడిచ్చెయ్. ఎనిమిదేసివుంటాయి మనకి."

"ఒరే, యిస్తూ యిస్తూ మూడేమిట్రా — అయిదేనా లేకుండానా? నిజానికి వాడు మనకి ఎంత ఉపకారం చేసినట్టు?"

"అయిదిస్తే మనకి ఏడేసి అవుతాయి. కొడుతూ కొడుతూ ఏడేసేమిటి- ఏడున్నర వుంటుంది నాలుగిచ్చెయ్."

ఇదో మోస్తరుగా వుంది. నాయుడుని పిలిచి నాలుగు రూపాయలూ లెక్కబెట్టి యిచ్చేశాను.

రామ్కిష్ణగాడు తెగనవ్వుతున్నాడు. స్కూల్లో జీరోలూ, డిజిట్ మార్కులూ వొచ్చేవి నీకు. ఇంతటివాడి వెలా అయ్యావు అని అభినందిస్తున్నాడు.

ఒంటిగంటన్నరయ్యేసరికి బంగాళా చేరుకుంటున్నాం.

అప్పటికి వరండామీద లైటు వెల్గుతోంది. ఓ కుర్చీమీద టి. యస్. ఓ. గారూ మరోకుర్చీమీద పంతులుగారూ కూర్చున్నారు. ఇదేమిటి చెప్మా రాత్రి ఒంటిగంట దాటాక ఆరాత్తుగా టి. యస్. ఓ గారు లేచికూచున్నారు. అని నేను ఆశ్చర్యపడుతున్నాను.

"ఏదో పనుండి పంతులుగారు లేపివుంటార్రా" అన్నాడు రామ్క్రిష్ణ.

పంతులుగార్ని చూడగానే అకస్మాత్తుగా నాకో విషయం జ్ఞాపకానికొచ్చింది.

"ఒరే - పాపం పంతులుగారు సాయంత్రం సిగరెట్లు లేని ఆపత్సమయంలో మనకి సిగరెట్లిచ్చి వుపకారం చేస్తే ఆయన కిలా చేశాం; మనదేనురా, ధర్మమన్నప్పుడు!" అన్నాను.

"లేకపోతే యేమిటనుకున్నావురా!" అన్నాడు రామ్క్రిష్ణ ఇదంతా వాడిప్రతాపమే అయినట్టు. ఇంకా ఇలా అన్నాడు. "ఉపకారికి నపకారము నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ! అన్నాడు కలి ధర్మస్మృతిలో"

"ఆహాఁ? ఈ కలి ధర్మాలూ, స్మృతులూ ఎవడిదగ్గర నేర్చుకున్నావురా?" అని నేను గురుత్వంతో నవ్వాను.

టి, యస్. ఓ గారు మామీద చాలా కోపంగా ఉన్నారు. "రండి రండి - మీకు ఘట్టిగా ఓ చురక వేస్తేనేగాని బుద్ధిరాదులా వుంది. నేను డి. యస్. ఓ. కి రాసేస్తాన్లెండి. ఇంతటి వాళ్ళయ్యారన్నమాట! మీకీ లంచంపుచ్చుకోడం ఎలా అలవాటయింది. వేషాలు వెయ్యదలుస్తున్నారే! ఇలా ఎందర్ని మోసం చేశారు. మీకు గూఢచారులు కొందరా? మీకేమన్నా బుద్ధులున్నాయా? తిన్నయింటికే వాసాలు లెక్కపెడుతున్నారే! లోగడ వొచ్చినప్పుడెవరింట్లో భోంచేశారో జ్ఞాపకం లేదేం, ఏమయ్యా యింతంత ఘోరాలకి తలపెట్టారు? ...... పోనీ ఏదో చేశారు. పంతులుగారు మంచివాళ్లే - పడెయ్యండి- ఎంత తీసుకున్నారు? ఇరవైటు; ఆయిరవై ఇలాపడెయ్యండి." అన్నారు.

నాకు మీదప్రాణాలు మీదనే ఎగిరిపోయాయి.

పంతులుగారన్నారు "నేను మామూలుగా రామ్మందిరంలోకి పేకాటకి పోయాను. ఆ వెంకడొచ్చి అర్జంటుగా ఇరవైరూపాయలు కావాలి; ఇలా యిలా ప్రమాదం వొచ్చింది. టి, యస్. ఓ. గారు బస్తాలు పట్టేసుకున్నారు. అని చెప్పేట్ట. పోనీ నాకు కబురేనా పంపేడు గాదు, తేల్చేద్దును. మన ఏర్పాటు వాడికేం తెలుసునూ, మా అబ్బాయి తీసిచ్చేసేడు."

"పోనీ ఇప్పుడు మించిపోయిందేమిటి? పడెయ్యండోయి ఆ యిరవై. రూపాయలూ ఇలాగ!" అన్నారు టి. యస్. ఓ. గారు.

టి. యస్. ఓ. గారు సాయంకాలమే పంతులుగారిదగ్గిర ఓ పెద్ద మొత్తాన్ని "మామూళ్లు" గా తీసుకోవడమే వారిప్పుడు ఆయనమీద చూపుతున్న అభిమానానికి కారణమని మాకేం తెలుసూ?

---

# క్యూ

(19-వ పేజీ తరువాయి)

మాటలు నడిచాయి. ఆ తరువాత మాటలకి, మాటలు బదులుపలికాయి. ఏదో అవ్యక్తానందాన్ని అనుభవించడంకోసమన్నట్లు, వారు మరికొంతకాలంతరువాత "క్యూ" నివిడిచిఎక్కడికోవెళ్ళిపోయినారు. అవ్యక్తానందాన్ని అనుభవించడం కోసం "క్యూ" ని వదిలివెళ్ళడం అవసరమేమోనని, నాకు తోచింది.........

మెదడు గిర్రున తిరిగింది...."క్యూ" రూపంలో ఆలోచనాపరంపరలు నా మెదడును చుట్టివేశాయి....క్రమేణా ఈ ఆలోచనలు, ఒక నిర్దుష్టస్వరూపాన్ని పొందాయి......

చావుబ్రతుకులనుబట్టి చూస్తే, మానవులంతా, మానవమాత్రులుగా, ఒక "క్యూ" లో యిమిడుతారు. ఒకరి తరువాత ఒకరు పుట్టడం, చివరకి గిట్టడం - దీనిని మానవమాత్రుడెవ్వడూ, ఇంతవరకు తప్పించుకోలేదు - "క్యూ" పద్ధతి అది మానవుడితో పుట్టింది - మానవప్రళయంతో అంతమొందుతుంది.

ప్రపంచమంతా "క్యూ"ల మయం. ఇందులో కొన్ని సహజమైనవీ, మరికొన్ని కృత్రిమమైనవి —

ఆదికవి వాల్మీకి కవుల "క్యూ"లో మొదటివాడు - ఈ "క్యూ" ఇంకా అంతం కాలేదు - కవిత్వం చచ్చి వూరుకున్ననాడు అంతమొందుతుంది. ఇదేవిధంగా, సంఘసంస్కర్తలది ఒక క్యూ - విజ్ఞానశాస్త్రవేత్తలది మరొక "క్యూ".

మానవమాత్రులు ఈ క్యూలని తప్పించుకోలేరు - సహజాసహజప్రసక్తి అటుంచి మరలు యంత్రంలో యిమిడినట్టే వారు ఏదో ఒక "క్యూ"లో యిమడక తప్పదు -

సహజమైన "క్యూ"లు ప్రగతిని ఆహ్వానిస్తాయి-మానవాభ్యుదయానికి సుస్వాగతం చెబుతాయి - మానవునిలో, క్లిష్టపరిస్థితుల్ని అధిగమించే శక్తినీ, ఉత్సాహాన్ని జాగరితం చేస్తాయి.

చీకటిబజారువర్తకులు, మతగురువులు, బూటకపు రాజకీయవేత్తలు, దోపిడీదారులు, హంతకులు, కృత్రిమమైన "క్యూ"లు ఏర్పర్చుకొని మానవాభ్యుదయానికి హానికరంగా పరిణమిస్తున్నారు - బ్రాహ్మలూ, రెడ్లూ, హరిజనులూ మొదలైన కృత్రిమమైన గోడల్ని నిలబెట్టి, సోదరమానవులమధ్య చీలికల్ని ఏర్పరుస్తున్నారు. ఈ కృత్రిమమైన "క్యూ"లు ఆమూలాగ్రంగా నశించడం అవసరమని నాకు తోచింది. వాటిని మూలచ్ఛేదం చేయడం మనధర్మమని, హృదయం హోరెత్తింది. ఆ అదృష్టం మనకి ఏనాటికైనా పడుతుందా? "ఏమోనని" ప్రస్తుతం నా హృదయం నిరాశతో మూల్గుతున్నది.......